E69 NEWS

తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు   జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో పని చేయుటకు నియోజకవర్గాలవారీగా విలేకరులు కావలెను వాట్సాప్ నెం: 9959812941-9949356387

PUBLISHED: HYDERABAD, JANGAON   సంపుటి :01   సంచిక :87   శుక్రవారం   28 ఆగస్టు 2026   ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్   పేజీలు: 04   వెల :05/-

## కేటీఆర్‌కు ప్రతిష్ఠాత్మక ఆహ్వానం



2 లో

జిందాల్ యూనివర్సిటీకి కేటీఆర్!

విద్యార్థులతో కేటీఆర్ ముఖాముఖి!

కేటీఆర్‌కు అరుదైన గౌరవం!

ప్రత్యేక ప్రసంగానికి కేటీఆర్‌కు పిలుపు!

జిందాల్ వర్సిటీలో కేటీఆర్ లెక్చర్!

## ఊర్లకు ఊర్లే జలసమాధి

వరదల్లో 300 మంది భారతీయులు

వేలాది మంది గల్లంతు

భారతీయుల కోసం గాలింపు

500 మంది విదేశీయుల ఆచూకీ లేదు

రసువాలో బీభత్స వరదలు

భారత్‌కు నేపాల్ ధన్యవాదాలు

బాధితుల రక్షణపై ఫోకస్

విపత్తు నుంచి కోలుకుంటాం



**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (తెలుగు గళం):** నేపాల్‌లో ఊహించని స్థాయిలో విరుచుకుపడ్డ అకస్మాత్తు వరదల వల్ల ఊళ్లకు ఊళ్లే కొట్టుకుపోయాయి. కొన్ని గంటల వ్యవధిలోనే వందలాది గ్రామాలు, పట్టణాలు వరద ప్రవాహానికి తుడిచి పెట్టుకుపోయాయి. ఈ ఘోర ప్రకృతి విపత్తులో ఇప్పటి వరకు 160 మంది మరణించగా.. వేలాది మంది ఆచూకీ లేకుండా పోయారు. వీరిలో మానససరోవర్ యాత్రకు వెళ్లిన సుమారు 300 మంది భారతీయ పౌరులు కూడా ఉన్నట్లు.. నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ తెలిపారు.

గంటల వ్యవధిలోనే కొట్టుకుపోయిన పట్టణాలు

కాఠ్మాండ్‌లో జరిగిన ఓ సదస్సులో పాల్గొన్న నేపాల్ విదేశాంగ మంత్రి శిశిర్ ఖనాల్ పాల్గొని ఈ విపత్తు తీవ్రతను వివరించారు. రసువా ప్రాంతంలో సంభవించిన ఈ భీకర వరదల వల్ల కొన్ని గంటల వ్యవధిలోనే ఊళ్లకు ఊళ్లే జలసమాధి అయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది కుటుంబాలు తమ ఇళ్లను కోల్పోయి వీధిన పడ్డారని.. ఇప్పటికీ వేలాది మంది జాడ తెలియకుండా పోయిందని చెప్పారు.

2 లో

## పూజల పేరుతో పైశాచికం

బాలికపై దొంగబాబాల దారుణం!

ఐశ్వర్యం పేరుతో బాలికకు నరకం!

మూఢనమ్మకాల ముసుగులో అరాచకం!

దొంగబాబాల బాగోతం బట్టబయలు!

గుప్త నిధుల పేరుతో ఘోరం!

పూజల పేరుతో బాలికపై వేధింపులు!

2 లో

పోక్సో కేసు.. దొంగబాబాల కోసం గాలింపు!

## జనగణనకు తెలంగాణలో లైన్ క్లియర్

గెజిట్ పునఃప్రచురణకు ఆదేశం

40 వివరాల సేకరణకు ఏర్పాట్లు

కులం, ఉపకులాల నమోదు

సెప్టెంబర్‌లో జనగణన ప్రారంభం

ఎన్యూమరేటర్లకు కీలక బాధ్యత

ఆగస్టు 17 నుంచే సెల్ఫ్ ఎన్‌రోల్‌మెంట్




**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (తెలుగు గళం):** భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'జనగణన-2027' ప్రక్రియకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది.

2 లో

## యూపీలో ఎంఐఎం ఎంట్రీ ఖాయం

మాది ఓట్లు చీల్చే పార్టీ కాదు!'

యూపీ బరిలో ఎంఐఎం.. ఒవైసీ క్లారిటీ!

ప్రత్యర్థులకు ఒవైసీ స్ట్రాంగ్ కౌంటర్!

యూపీలో ఎంఐఎం దూకుడు.. గెలుపుపై ధీమా!

'ఎంఐఎం ఓట్లు చీల్చదు'.. ఒవైసీ ఫైర్!

యూపీ ఎన్నికలపై ఒవైసీ సంచలన వ్యాఖ్యలు!

ప్రత్యామ్నాయ శక్తిగా ఎంఐఎం.. ఒవైసీ!

2 లో

## మోదీకి ఖర్గే కీలక లేఖ

డీలిమిటేషన్‌పై ఖర్గే డిమాండ్లు!

మోడీకి ఖర్గే కీలక లేఖ!

డీలిమిటేషన్‌పై కాంగ్రెస్ డెడ్‌లైన్!

543 సీట్లు.. 25 ఏళ్లకు ఖర్గే డిమాండ్!

డీలిమిటేషన్‌పై అఖిలపక్ష భేటీకి పిలుపు!

మహిళా రిజర్వేషన్లపై ఖర్గే డిమాండ్!

డీలిమిటేషన్‌పై బుల్డోజర్ నిర్ణయాలు వద్దు!

మోడీ ముందు ఖర్గే 3 డిమాండ్లు!

2 లో

## గవర్నర్‌ను పరామర్శించిన సీఎం



2 లో

**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (తెలుగు గళం):** అనారోగ్య కారణాలతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రి లో చేరిన తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా చికిత్స అనంతరం గురువారం మధ్యాహ్నం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు.

## ట్రావెల్స్ బస్సులో భారీ చోరీ



2 లో

బస్సులో రూ.50 లక్షల బంగారం మాయం!

300 గ్రాముల బంగారంపై కన్నేసిన దొంగలు!

బస్సులో బ్యాగ్ మాయం.. పోలీసుల దర్యాప్తు!

టంగుటూరులో బంగారం చోరీ కలకలం!

పెళ్లి నగలు పోయాయ్.. ప్రయాణికుడికి షాక్!

సీసీ కెమెరాలు లేవు.. దొంగతనంపై అనుమానాలు!

రూ.50 లక్షల చోరీ.. బస్సు మొత్తం తనిఖీ!

# గులాబీలో మళ్లీ గుబులు!



**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (తెలుగు గళం):** బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు, కేసీఆర్ కు వెన్నుపోటు పొడిచేందుకు హరీశ్ రావు కుట్రలు చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. గురువారం బంజారాహిల్స్‌లోని టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇటీవలే మెదక్ ఎమ్మెల్యేలతో హరీశ్ రావు మీటింగ్ పెట్టారని ఈ మీటింగ్ లో కేసీఆర్ ఎన్టీఆర్ లా పెద్ద మనిషి. కానీ ఆయన కొడుకు వారసత్వం ఇవ్వడం సరికాదని హరీశ్ రావు అన్నట్లు ఆ మీటింగ్ లో ఉన్న ఒక ఎమ్మెల్యేనే నాకు ఈ విషయం చెప్పారని కవిత ఆరోపించారు. ఎన్టీఆర్ పేరు తీసుకున్నారంటే గుంటనక్క వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధమైందని హరీశ్ రావును ఉద్దేశించి ఘాటు విమర్శలు చేశారు.

మిగతాది 2 లో..

- కేసీఆర్‌కు వెన్నుపోటు కుట్ర?
- హరీశ్ సీక్రెట్ మీటింగ్!
- బీజేపీతో హరీశ్ మిలాఖత్!
- ఆర్ఎస్ఎస్ నేతతో రహస్య భేటీ
- లండన్ భేటీపై కవిత సంచలన ఆరోపణ
- రూ.960 కోట్ల పాల వ్యాపారమా?
- క్విడ్ ప్రో కోపై కవిత ఫైర్
- ఆంధ్రా పెత్తనంపై కవిత ఆగ్రహం
- యాదాద్రి బోర్డుపై కీలక డిమాండ్

## హరీశ్ రావు అరెస్ట్

కలెక్టరేట్ వద్ద హైటెన్షన్

బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం

విద్యార్థులకు హరీశ్ మద్దతు

పోలీసులతో వాగ్వాదం

సుబేదారి స్టేషన్‌కు తరలింపు

జీవో 97పై విద్యార్థుల నిరసన

కాంగ్రెస్ సర్కార్‌పై బీఆర్ఎస్ ఫైర్



**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (తెలుగు గళం):** హన్మకొండ కలెక్టరేట్ ప్రాంగణం గురువారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలపడంతో పాటు, ధర్నా నిర్వహిస్తున్న టీఎన్జీఓ నాయకులకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావును పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన హరీష్ రావు.. సుబేదారి పోలీస్ స్టేషన్ కు నడుచుకుంటూ వెళ్లారు.

2 లో

## 2036 ఒలింపిక్స్‌పై మోదీ పిలుపు

క్రీడలే వ్యక్తిత్వ వికాసం

యువతపై మోదీ ఫోకస్

టాలెంట్ హంట్‌కు పిలుపు

స్పోర్ట్స్ సెంటర్ల ఏర్పాటు

విభిన్న క్రీడల్లో రాణించాలి

తెలంగాణలో ఖేలో ఇండియా

నాలుగు జిల్లాల్లో పోటీలు



**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (తెలుగు గళం):** జాతీయ క్రీడా దినోత్సవం 2026 సందర్భాన్ని పురస్కరించుకుని "ఖేల్ కీ బాత్.. పీఎం కే సాత్" కార్యక్రమంలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా ఉన్న యువత, అథ్లెట్లతో వర్చువల్‌గా ముఖాముఖి నిర్వహించారు.

2 లో

# ఊర్లకు ఊర్లే జలసమాధి

మొదటి పేజీ తరువాయి

నష్టం ఏ స్థాయిలో ఉందో పూర్తిగా అంచనా వేసేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

భారత యాత్రికుల ఆచూకీ కోసం గాలింపు

వరద ప్రభావిత ప్రాంతమైన రసువా మీదుగా మానససరోవర్ యాత్ర సాగుతుంది. ఈ క్రమంలో యాత్రకు వెళ్లినభారతీయులతో సహా దాదాపు 500 మంది విదేశీ పౌరులు ప్రస్తుతం అధికారులకు అందుబాటులోకి రాకుండా పోయారన్నారు. వీరిలో 300 మందికి పైగా భారతీయులు ఉన్నారని మంత్రి చెప్పారు. అస్వస్థతకు గురైన లేదా చిక్కుకుపోయిన విదేశీయులతో సంబంధాలు పునరుద్ధరించడానికి నేపాల్ ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోందని వివరించారు. తమ సొంత పౌరుల భద్రతకు ఎంత ప్రాధాన్యత ఇస్తామో, విదేశీ పౌరుల క్షేమానికి కూడా అంతే కట్టుబడి ఉన్నామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ విషయంలో వివిధ దేశాల రాయబార కార్యాలయాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు.

జలప్రళయం.. ఊర్లకు ఊర్లే మాయం.. ఒక్కసారిగా ముంచెత్తిన వరద

భారత్‌కు కృతజ్ఞతలు చెప్పిన మంత్రి

ఇటీవలి కాలంలో దేశాన్ని చుట్టుముట్టిన అతిపెద్ద విపత్తుల్లో ఇదొకటని పేర్కొన్న విదేశాంగ మంత్రి.. ఈ కష్ట సమయంలో భారత్ తక్షణమే స్పందించి సహాయ సామాగ్రిని అందించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం తమ దృష్టి అంతా బాధితుల రక్షణ, తక్షణ సహాయక చర్యలపైనే ఉందని స్పష్టం చేశారు. అదే సమయంలో దేశ పునర్నిర్మాణం కోసం అంతర్జాతీయ సమాజం నేపాల్‌తో అనుసంధానమై ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వరద ప్రభావం దేశమంతటా లేదని, పోఖారా, మౌంట్ ఎవరెస్ట్ వంటి ప్రధాన పర్యాటక ప్రాంతాలు సురక్షితంగానే ఉన్నాయని చెప్పారు. పర్యాటకులు నేపాల్‌ను సందర్శించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి సహాయపడాలని కోరారు. 2015 నాటి వినాశకర భూకంపం నుంచి కోలుకున్నట్లే.. నేపాల్ ఈ విపత్తు నుంచి కూడా మరింత బలంగా కోలుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# హరీశ్ రావు అరెస్ట్

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం

హరీశ్ రావును అరెస్ట్ చేయడంపై బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రతిపక్ష నాయకులు శాంతియుతంగా ప్రజా సమస్యలపై స్పందిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసు బలగాలతో నిర్బంధాలకు పాల్పడుతోందని, గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు మండిపడ్డాయి. ఈ ఘర్షణతో హన్మకొండ కలెక్టరేట్ వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు.

వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం (జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ) ఆందోళన కార్యక్రమాలు చేపట్టగా, టీఎన్జీఓలు కూడా ధర్నా నిర్వహించాయి. తొలుత హరీశ్ రావు పర్యటనకు అనుమతి లేదంటూ పోలీసులు ఉదయాన్నే హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే.. అన్ని ఆంక్షలను దాటుకుని హరీశ్ రావు హనుమకొండ కలెక్టరేట్ వద్దకు చేరుకుని ధర్నాలో పాల్గొని విద్యార్థులకు మద్దతు తెలిపారు. హరీశ్ రావు రాకతో కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో వాతావరణం మరింత వేడెక్కింది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు ఆయనను బలవంతంగా అరెస్ట్ చేసి అక్కడి నుండి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

# 2036 ఒలింపిక్స్‌పై మోదీ పిలుపు

మొదటి పేజీ తరువాయి


'ఖేలో ఇండియా సంవాద్' పేరిట నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమంలో దేశంలోని 1,500కు పైగా కాలేజీల విద్యార్థులు నేరుగా పాలుపంచుకున్నారు. క్రీడలు, ఫిట్‌నెస్ మరియు దేశాభివృద్ధిలో యువత పాత్రపై ప్రధాని ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు.

దేశ ప్రజలకు, క్రీడాకారులకు జాతీయ క్రీడా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మేజర్ ధ్యాన్‌చంద్ కృషిని గుర్తుచేస్తూ.. వందేళ్ల క్రితం భారత హాకీ జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లిన వైనాన్ని, ఇటీవల తాను న్యూజిలాండ్ వెళ్లినప్పుడు కూడా ఈ చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేసినట్లు పేర్కొన్నారు. "ఆటలంటే కేవలం పతకాలు సాధించడం మాత్రమే కాదు; అవి వ్యక్తిత్వాన్ని, కుటుంబాన్ని, రాష్ట్రాన్ని మరియు దేశాన్ని వికసింపజేస్తాయి. క్రీడలు చాంపియన్లనే కాకుండా ఉత్తమ పోటీదారులను తయారుచేస్తాయి. కిందపడినా తిరిగి లేచి గెలిచే దృఢ సంకల్పాన్ని ఇస్తాయి" అని ప్రధాని ఉద్ఘాటించారు. 2012 ఒలింపిక్స్‌లో భారత్ కేవలం 12 రకాల ఆటల్లో మాత్రమే ప్రాతినిధ్యం వహించిందని, ఆ సమయంలో కొన్ని ఆటల పేర్లు కూడా చాలామందికి తెలియదని గుర్తుచేశారు. భారత్‌కు సుదీర్ఘ కోస్తా తీరం, మంచు పర్వతాలు ఉన్నందున సర్ఫింగ్, వింటర్ స్పోర్ట్స్ వంటి విభిన్న క్రీడల్లోనూ మన యువత ప్రావీణ్యం సాధించాలని పిలుపునిచ్చారు. 2036 ఒలింపిక్స్ లక్ష్యంగా ఇప్పటినుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని ప్రధాని తెలిపారు. 5 నుండి 15 ఏళ్ల వయస్సు గల చిన్నారుల్లో ఉన్న ప్రతిభను గురించడానికి 'టాలెంట్ హంట్' చేపట్టాలని సూచించారు. దేశంలో అత్యాధునిక స్పోర్ట్స్ సెంటర్లను నెలకొల్పుతున్నామని, స్పోర్ట్స్ సైన్స్, కోచింగ్ మెళకువలను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు.

తెలంగాణలో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్

రాబోయే డిసెంబర్‌లో 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ తెలంగాణ వేదికగా జరగనున్నాయని ప్రధాని మోదీ తెలిపారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ పోటీలను వైభవంగా నిర్వహించనున్నారు. క్రీడాకారులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటాలని పిలుపునిచ్చారు.

# మోదీకి ఖర్గే కీలక లేఖ




**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (తెలుగు గళం):** దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే నియోజకవర్గాల పునర్విభజన వంటి సున్నితమైన అంశంపై ప్రభుత్వం ఏకపక్షంగా ముందడుగు వేయకూడదని ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోడీని విజ్ఞప్తి చేశారు. డీలిమిటేషన్ బిల్లును బలవంతంగా తీసుకురావొద్దని నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలపై చర్చించేందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. డీలిమిటేషన్ పై ప్రత్యేకంగా పార్లమెంట్ సమావేశాలు ఏర్పాటు చేయబోతున్నారనే చర్చ నేపథ్యంలో తాజాగా మోడీకి ఖర్గే లేఖ రాశారు. నియోజకవర్గాల పునర్విభజనపై కాంగ్రెస్ పార్టీ తరపున మూడు స్పష్టమైన డిమాండ్లను ప్రధాని ముందుంచారు.

కాంగ్రెస్ పార్టీ ప్రధాన డిమాండ్లు:

ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల సంఖ్యను మార్చకుండా మరో 25 సంవత్సరాల పాటు ఇలాగే కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రాల వారీగా ఉన్న లోక్‌సభ స్థానాల ప్రాతినిధ్యంలో ఎలాంటి మార్పులు చేయకుండా ప్రస్తుత సంఖ్యనే మరో 25 ఏళ్ల పాటు కొనసాగించాలన్నారు. రాబోయే 2029 లోక్‌సభ ఎన్నికల నాటికే చట్టసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లను అమల్లోకి తీసుకురావాలని ఖర్గే డిమాండ్ చేశారు. గతంలో ఏప్రిల్ 16, 17 తేదీల్లో చేసిన విధంగా బుల్డోజర్ తరహా నిర్ణయాలను మళ్లీ పునరావృతం చేయవద్దని హెచ్చరించారు. ఈ విషయంలో జులై 16, 2026న తాను రాసిన లేఖను కూడా ఖర్గే గుర్తు చేస్తూ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి అన్ని పార్టీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

# కేటీఆర్‌కు ప్రతిష్ఠాత్మక ఆహ్వానం



**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (తెలుగు గళం):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు మరో ప్రతిష్ఠాత్మక ఆహ్వానం అందింది. హర్యానాలో ప్రముఖ ఓపీ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి విచ్చేసి.. అక్కడి విద్యార్థులు, అధ్యాపకులతో మాట్లాడటంతో పాటు.. వారిని ఉద్దేశించి డిస్టింగ్విష్డ్ పబ్లిక్ లెక్చర్ ఇవ్వాల్సిందిగా సదరు యూనివర్సిటీ కేటీఆర్ ను ఆహ్వానించింది. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ వైస్ చాన్స్ లర్ ప్రొఫెసర్ సి. రాజ్ కుమార్ ఈ మేరకు కేటీఆర్ కు లేఖ రాశారు. ఆయన రాకతోపాటు.. ఆలోచనలు విద్యార్థులకు ఇచ్చే ప్రసంగం ఎంతో స్ఫూర్తినిస్తాయని, వారిలో ప్రేరణ కలిగిస్తాయని పేర్కొన్నారు. కేటీఆర్ కు అనుకూలమైన తేదీ, సమయాన్ని బట్టీ సెప్టెంబర్, అక్టోబర్ 2026లో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు లేఖలో తెలిపారు.

ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన భారత్‌లోనే తొలి రాజ్యాంగ మ్యూజియం, రైట్స్ అండ్ ఫ్రీడమ్స్ అకాడమీని సందర్శించాలని కూడా కేటీఆర్‌ను ఆహ్వానించారు. భారత రాజ్యాంగానికి ఆమోదం లభించి.. 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ రాజ్యాంగ మ్యూజియంలో రాజ్యాంగ నిర్మాణ సమయంలో ఎదురైన పోరాటాలు, సవాళ్లు, రాజ్యాంగ నిర్మాతల కృషిని ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

2009లో స్థాపించిన ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ ప్రస్తుతం దేశంలోని వివిధ విభాగాల, పరిశోధనాధారిత విద్యా సంస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకింగ్స్‌లోనూ జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ విశేష గుర్తింపు సాధించింది. టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆన్‌లైన్ లెర్నింగ్ ర్యాంకింగ్స్--2024లో గోల్డ్ రేటింగ్ పొందడంతో పాటు, క్యూఎస్, టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో వివిధ విభాగాల్లో ప్రముఖ స్థానాలు దక్కించుకుంది. 2020లో భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ నుంచి 'ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్' హోదాను కూడా పొందింది. గతంలో రాష్ట్రపతులు, ఉప రాష్ట్రపతులు, భారత ప్రధాన న్యాయమూర్తులు, కేంద్ర మంత్రులు, గవర్నర్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సహా పలువురు ప్రముఖులు జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కేటీఆర్ ఈ ఆహ్వానాన్ని స్వీకరించి యూనివర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులతో తన ఆలోచనలను పంచుకుంటారని యూనివర్సిటీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# పూజల పేరుతో పైశాచికం




**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (తెలుగు గళం):** గుప్త నిధులు, ధన లాభం వస్తుందంటూ మూఢనమ్మకాల పేరుతో ఒక మైనర్ బాలికపై దొంగ బాబాలు దారుణానికి ఒడిగట్టారు. పూజల పేరుతో బాలికను పలుమార్లు వివస్త్రను చేసి, అసభ్యకరంగా తాకుతూ నరకయాతనకు గురిచేసిన దిగ్భ్రాంతికర సంఘటన అనంతపురంలో వెలుగు చూసింది. ఈ ఘటనపై పోలీసులు ఐదుగురు నిందితులపై పోక్సో సహా వివిధ తీవ్రమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. అనంతపురం నగరానికి చెందిన ఓ వ్యక్తికి మహాలక్ష్మి అనే మహిళతో పరిచయం ఏర్పడింది. అతనికి ఉన్న హోటల్ వ్యాపారంలో భారీగా లాభాలు వస్తాయని, లక్ష్మీదేవి కటాక్షిస్తుందని నమ్మబలికిన మహాలక్ష్మి.. అందుకోసం ప్రత్యేక పూజలు చేయాలని సూచించింది. పూజలో భాగంగా అతని మైనర్ కుమార్తెను వివస్త్రగా కూర్చోబెడితే కోరుకున్న ఐశ్వర్యం సొంతమవుతుందని మాయమాటలు చెప్పింది. మొదట ఆ తండ్రి ఒప్పుకోకపోయినా, మహాలక్ష్మి పదే పదే నమ్మబలకడంతో చివరకు అంగీకరించాడు.

6 నెలలుగా మూఢనమ్మకాల పేరుతో నరకం..

బాధితురాలిని ఓ రహస్య ప్రదేశానికి తీసుకెళ్లిన హేమంత్ అనే దొంగ బాబా. ఆమెను వివస్త్రగా చేసి పూజల పేరుతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అంతటితో ఆగకుండా పూజలు ఫలించలేదనే సాకుతో ఈ నెల 8న తన కుమారుడు బాలసుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్ అనే వ్యక్తులతో కలిసి మళ్లీ బాలికను వివస్త్రను చేసి పూజలు నిర్వహించారు. అయినా ఫలితం రాలేదని చెప్పి.. ఈ నెల 9న బాలికను, ఆమె తల్లిని కడపలోని వెంకటేష్ యాదవ్ అనే మరో దొంగ గురువు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ పూజల పేరుతో బాలికను తీవ్ర చిత్రహింసలకు గురిచేశారు. ఈనెల 11న మరోసారి పూజలు చేయాలంటూ బాలికను నిందితులు కారులో ఎక్కించుకుని తీసుకెళ్తుండగా, స్థానికులు గమనించి అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు.

విషయం తెలిసి భయాందోళనకు గురైన దొంగ బాబాలు, బాలికను ఆమె తల్లిని కారులో నుంచి దింపేసి అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కడప జిల్లా వల్లూరు పోలీసులు మొదట జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తదనంతరం బుధవారం రోజున ఈ కేసును ఘటన పరిధిలోకి వచ్చే అనంతపురం వన్ టౌన్ పోలీస్ స్టేషనకు బదిలీ చేశారు. ఈ దారుణానికి పాల్పడిన దొంగ బాబాలు హేమంత్. బాలసుబ్రహ్మణ్యం, వెంకటేష్ యాదవ్‌తో పాటు వీరికి సహకరించిన మహాలక్ష్మి.. సాయి ప్రణవ్‌లపై పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

# ట్రావెల్స్ బస్సులో భారీ చోరీ




**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (తెలుగు గళం):** ప్రకాశం జిల్లా టంగుటూరు సమీపంలో కావేరి ట్రావెల్స్ బస్సులో భారీ చోరీ కలకలం రేపింది. బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్తున్న బస్సులో ఓ ప్రయాణికుడికి చెందిన సుమారు రూ.50 లక్షల విలువైన 300 గ్రాముల బంగారం చోరీకి గురైంది. దీంతో ప్రయాణికుల్లో ఒక్కసారిగా ఆందోళన నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల వివరాల ప్రకారం.. వివాహ కార్యక్రమం కోసం వెంకట కృష్ణ అనే వ్యక్తి బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్తున్నాడు. అతడు కావేరి ట్రావెల్స్ బస్సులో బంగారు నగలతో కూడిన బ్యాగును వెంట తీసుకెళ్తున్నాడు. టంగుటూరు సమీపానికి చేరుకునే సమయానికి బ్యాగు కనిపించకపోవడంతో చోరీ జరిగినట్లు గుర్తించాడు. వెంటనే వెంకట కృష్ణ టంగుటూరు పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి కావేరి ట్రావెల్స్ బస్సును టంగుటూరు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బస్సులోని ప్రయాణికుల వివరాలు, లగేజీ, ఇతర ప్రాంతాలను పరిశీలిస్తూ చోరీకి సంబంధించి ఆధారాలను సేకరిస్తున్నారు.

ఈ ఘటనతో బస్సులో ప్రయాణిస్తున్న ఇతర ప్రయాణికులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణికుల భద్రత కోసం ఏర్పాటు చేయాల్సిన సీసీ కెమెరాలు లేకపోవడం వల్లే చోరీకి అవకాశం ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చోరీ జరిగిన సమయంలో బస్సులో ఎవరెవరు ప్రయాణించారు?.. బంగారం ఉన్న బ్యాగును ఎవరు తీసుకెళ్లారు?.. అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో దర్యాప్తు అధికారులకు సవాల్‌గా మారింది.

# గవర్నర్‌ను పరామర్శించిన సీఎం



**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (తెలుగు గళం):** అనారోగ్య కారణాలతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రి లో చేరిన తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా చికిత్స అనంతరం గురువారం మధ్యాహ్నం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. బుధవారం రాత్రి యశోద ఆస్పత్రి నిపుణులైన వైద్యుల బృందం గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు గుండె సంబంధిత శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉండటంతో డిశ్చార్జ్ చేశారు. కాగా, గురువారం ఉదయం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి గవర్నర్‌ను నేరుగా పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా పూర్తి కోలుకోవాలని ఆకాంక్షించిన విషయం తెలిసిందే.

# జనగణనకు తెలంగాణలో లైన్ క్లియర్

మొదటి పేజీ తరువాయి

కేంద్ర హోంశాఖ ఆగస్టు 14న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ నంబర్ 4505(ఈ)ను తెలంగాణ రాష్ట్ర గెజిట్‌లో పున:ప్రచురించాలని జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే జనాభా గణనకు అధికారికంగా మార్గం సుగమమైంది. అయితే, జనగణన జనాభా లెక్కింపు విడతలో పౌరుల నుంచి మొత్తం 40 రకాల వివరాలను సేకరించాలని కేంద్ర రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. 1948 సెన్సస్ చట్టంలోని నిబంధనల ప్రకారం నియమించబడే ఎన్యూమరేటర్లు ఇళ్లకు వెళ్లి ఈ వివరాలను సేకరించేందుకు అధికారం కల్పించారు.

ఇప్పటికే 40 ప్రశ్నలకు నోటిఫై చేసిన కేంద్రం

అయితే, జనగణనలో అడిగే 40 ప్రశ్నలను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే నోటిఫై చేసింది. వాటిలో కులం, కోవిడ్ టీకా వేయించుకున్న ప్రదేశం వంటి అంశాలు ఉన్నాయి. మహిళలు, పురుషుల లెక్కింపుతో పాటు కులం, ఉపకులాలను లెక్కించి జాబితా రూపొందించనున్నారు. జన గణన ప్రక్రియ సెప్టెంబర్ 1న ప్రారంభమై సెప్టెబర్ 30తో ముగియనుంది. అంతకు ముందే ఆగస్టు 17 నుంచి 31 వరకు ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే సదుపాయాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది.

# యూపీలో ఎంఐఎం ఎంట్రీ ఖాయం




**న్యూస్ డెస్క్, 27 ఆగస్టు (తెలుగు గళం):** ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ తప్పకుండా పోటీ చేస్తుందని, అయితే ఎన్ని స్థానాల్లో బరిలోకి దిగుతామనే అంశంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. యూపీలో ఎంఐఎం సంస్థాగతంగా మునుపటి కంటే చాలా పుంజుకుందని అన్నారు. ఈసారి గతంలో కంటే అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఏ స్థానాల్లో, ఎంతమంది అభ్యర్థులను నిలబెడతామనే వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని అసదుద్దీన్ ఒవైసీ వెల్లడించారు.

'ఓట్లు చీల్చే పార్టీ' ప్రచారంపై ఫైర్..

ఏఐఎంఐఎం పార్టీపై నిరంతరం ఓట్లు చీల్చే పార్టీ అంటూ వస్తున్న ఆరోపణలను అసదుద్దీన్ ఒవైసీ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి అసత్య ప్రచారాల ద్వారా ఎన్డీయే అధికారంలోకి వస్తుందనే భ్రమలను కల్పించేందుకు ప్రత్యర్థి పార్టీలు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. కొందరు నాయకులు వల్లించే లౌకికవాదానికి, క్షేత్రస్థాయి వాస్తవాలకు ఎలాంటి సంబంధం లేదని అసదుద్దీన్ ఒవైసీ ఎద్దేవా చేశారు.

ప్రత్యామ్నాయ శక్తిగా ఏఐఎంఐఎం..

ప్రజలు ఇప్పుడు తమ స్వంత రాజకీయ నాయకత్వాన్ని బలపరుచుకోవాలనే నిశ్చయంతో ఉన్నారని, ఏఐఎంఐఎం ఓ బలమైన ప్రత్యామ్నాయంగా మారుతోందని అసదుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు. బిహార్ ఎన్నికల ఫలితాలు ఈ ఆలోచనకు మరింత బలాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. రాబోయే ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో ఎంఐఎం నుంచి పెద్ద సంఖ్యలో అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా విజయం సాధిస్తారని అసదుద్దీన్ ఒవైసీసీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# గులాబీలో మళ్లీ గుబులు!

మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ పార్టీని పూర్తిగా తన హస్తగతం చేసుకొని ఆ తర్వాత బీజేపీ సపోర్ట్ తీసుకోవాలని కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. బీజేపీతో హరీశ్ రావు మిలాఖత్ ఉందని చెప్పటానికి నా దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయన్నారు.

**ఆర్ఎస్ఎస్ ప్రముఖుడితో మంతనాలు:**

రాజ్ పుష్ప ఓపెన్ స్కై విల్లాస్ లో ఒక ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు వచ్చినప్పుడల్లా ఆయనకు పసుపు, మిరియాలు కలిపిన పాలు వెళ్తుంటాయని ఆ రోజు హరీశ్ రావు పూర్తిగా తన కార్యక్రమాలను రద్దు చేసుకోని ఆయనతో మీటింగ్ పెడతారని కవిత ఆరోపించారు. తాను ఇప్పుడు బీఆర్ఎస్ లో లేనని ఆ పార్టీ ఎలా పోయినా నాకు సంబంధం లేదు. కానీ తిన్నింటి వాసాలు లెక్కపెట్టే గుంటనక్క గురించి తెలియాలని ఈ విషయాలన్నీ చెబుతున్నానన్నారు. ఇప్పుడున్న ముఖ్యమంత్రితో కచ్చితంగా హరీశ్ రావుకు లాలూచీ ఉందన్నారు. అందువల్లే తెలంగాణ ప్రయోజనాలను ముఖ్యమంత్రి తాకట్టు పెడుతున్నప్పటికీ బీఆర్ఎస్ మాట్లాడటం లేదని విమర్శించారు. కొద్ది రోజుల క్రితమే లండన్?లో సీఎంరేవంత్ రెడ్డి, హరీశ్ రావు మధ్య మీటింగ్ జరిగిందన్నారు. నిజంగా లండన్ లో ఈ ఇద్దరి మధ్య లాలూచీ లేకపోతే హరీశ్ రావుపై క్విడ్ ప్రో కో కేసు నమోదు చేయాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ఇక ఆంధ్రావాళ్లతో కేటీఆర్ కు వ్యాపార సంబంధాలు, దోస్తులు ఉండటంతో ఆయన మాట్లాడటం లేదని కవిత ఆరోపించారు.

**మంత్రిగా ఉంటూ ఆంధ్రావాళ్లతో వ్యాపారం:** ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హరీశ్ రావు కార్పొరేట్ సంస్థలతో పాల వ్యాపారం చేశారని ఒక్క నారాయణ, చైతన్య కాలేజ్ లకే నెలకు 5 కోట్ల చొప్పున 8 ఏళ్లుగా 960 కోట్ల వ్యాపారం చేశారని ఆరోపించారు. ఇంకా కార్పొరేట్ హాస్పిటల్స్ కిమ్, కామినేని, యశోద వంటి హాస్పిటల్స్ తోనూ పాల వ్యాపారం చేశారన్నరు. ఆరోగ్య శాఖ మంత్రిగా ఉంటూ ఇలా ఆంధ్రావాళ్లతో పాల వ్యాపారం చేయటం క్విడ్ ప్రో కో కాదా? అని ప్రశ్నించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ వ్యవస్థీకృత అవినీతికి పాల్పడిందని, పాల వ్యాపారం ఒకరికి, రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒకరికి, ఇసుక వ్యాపారం ఒకరికి అన్నట్లు పంచుకొని దోచుకున్నారని ఆరోపించారు.

**ఆంధ్రా హీరో భార్యకు యాదాద్రి బోర్డు మెంబరా?:** రేవంత్ రెడ్డి అంటే అనుముల రేవంత్ రెడ్డి కాదు ఆంధ్రా రేవంత్ రెడ్డి అని విమర్శించారు. బ్రహ్మణ పరిషత్‌లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులు ఆంధ్రా వాళ్లకు ఇచ్చారు. అంటే తెలంగాణలో బ్రహ్మణ మేధావులు లేరా? పొలిటికల్ పదవులు కచ్చితంగా తెలంగాణ వాళ్లకే ఇవ్వాలన్నారు. ఇప్పుడున్న బ్రహ్మణ పరిషత్ ఛైర్మన్ బసవరాజు శ్రీనివాసరావు పచ్చి తెలంగాణ వ్యతిరేకి అని తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ వాదులపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడారని గుర్తుచేశారు. పేద బ్రాహ్మణులకు మేలు చేయాల్సిన తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఆంధ్రా రౌడీలకు అడ్డాగా మారిందని దళిత మహిళలను, తెలంగాణ వాళ్లను బసవరాజు శ్రీనివాసరావు ఇష్టమొచ్చినట్లు తిట్టాడని ఆరోపించారు. వెంటనే ఆంధ్రా వాళ్లకు ఇచ్చిన చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను తొలగించి తెలంగాణ వాళ్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భక్తుల పైసలతో కట్టిన యాదాద్రి గుడిలో మెంబర్ గా ఆంధ్రా హీరో భార్యకు అవకాశం కల్పించారని తిరుపతి బోర్డులో మనవాళ్లకు అవకాశం కల్పించటమంటే అక్కడ మనవాళ్ల పైసలు కూడా ఉంటాయన్నారు. నిజంగా ముఖ్యమంత్రికి తెలంగాణ సోయి ఉంటే బ్రహ్మణ పరిషత్‌లో యాదాద్రి గుడి బోర్డులో ఉన్న ఆంధ్రావాళ్లను తొలగించాలని డిమాండ్ చేశారు.

# ప్రజా గొంతుకకు రక్షణ ఎక్కడ?

**జర్నలిస్టు కలాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజానిదే**

**నిజం రాస్తే దాడులు.. ప్రశ్నిస్తే బెదిరింపులు.. పోరాడితే గుర్తింపు కరవు**

**--ప్రజాస్వామ్యానికి నాల్గో స్తంభంగా నిలిచిన పత్రికారంగానికి భద్రత,గౌరవం,సంక్షేమం అత్యవసరం**

### ప్రత్యేక వ్యాసం

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు, ప్రభుత్వాలు, చట్టసభలు మాత్రమే కాదు. ప్రజల సమస్యలను వినిపించడం, అధికార వ్యవస్థను ప్రశ్నించడం, పాలకుల పనితీరును ప్రజల ముందుంచడం, అన్యాయం జరిగినప్పుడు బాధితుల తరఫున నిలబడటం, సమాజంలో జరుగుతున్న పరిణామాలను వాస్తవాల ఆధారంగా ప్రజలకు తెలియజేయడం కూడా ప్రజాస్వామ్యానికి అంతర్భాగమే. ఈ బాధ్యతను నిరంతరం నిర్వర్తించే వ్యవస్థ పత్రికారంగం. శాసన, కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థలతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థకు ‘నాల్గో స్తంభం’గా పత్రికారంగాన్ని అభివర్ణిస్తారు. అయితే ఆ నాల్గో స్తంభాన్ని నిలబెట్టే జర్నలిస్టు పరిస్థితి మాత్రం నేడు ఆందోళనకరంగా మారుతోంది. ప్రజల సమస్యలపై రాస్తే కొందరికి కోపం.. అక్రమాలను ప్రశ్నిస్తే మరికొందరికి ఆగ్రహం.. అవినీతిని వెలికితీస్తే బెదిరింపులు.. అధికార దుర్వినియోగాన్ని ఎండగడితే ఒత్తిళ్లు.. సామాజిక అన్యాయాలపై గొంతెత్తితే వ్యక్తిగత విమర్శలు --- ఇలా జర్నలిస్టు వృత్తి రోజురోజుకూ సవాళ్లతో కూడుకున్నదిగా మారుతోంది.

కలం చేతిలో పట్టుకున్న వ్యక్తి సమాజానికి అద్దం పడతాడు. ఆ అద్దంలో కనిపించే వాస్తవం నచ్చకపోతే అద్దాన్ని పగులగొట్టడం సమస్యకు పరిష్కారం కాదు. వాస్తవాన్ని మార్చాలి.

### ప్రజల మధ్యే జర్నలిస్టు జీవితం

జర్నలిస్టు జీవితం బయటకు కనిపించేంత సులభమైనది కాదు. ఎండైనా.. వానైనా.. పగలైనా.. రాత్రైనా.. ప్రమాదం ఉన్నా.. అత్యవసర పరిస్థితి ఉన్నా.. సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకోవడం, వాస్తవాలను సేకరించడం, బాధితులను కలవడం, అధికారుల స్పందన తీసుకోవడం, సమాచారాన్ని నిర్ధారించడం, అనంతరం వార్తగా ప్రజల ముందుంచడం --- ఇదే క్షేత్రస్థాయి జర్నలిస్టు నిత్యజీవితం.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే విలేకరుల పరిస్థితి మరింత కఠినంగా ఉంటుంది. ఒకవైపు విస్తృత భౌగోళిక పరిధి.. మరోవైపు పరిమిత వనరులు.. ప్రయాణ ఖర్చులు.. సమాచార సేకరణలో ఎదురయ్యే ఇబ్బందులు.. అధికారుల నుంచి స్పందన పొందడంలో సమస్యలు.. అయినప్పటికీ ప్రజల సమస్యలకు ప్రాధాన్యతనిస్తూ వార్తలు అందించాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది.గ్రామంలో తాగునీరు రాకపోయినా, రోడ్డు దెబ్బతిన్నా, పాఠశాలలో సమస్య ఉన్నా, ఆసుపత్రిలో సౌకర్యాలు లేకపోయినా, పింఛన్ అందకపోయినా, ప్రభుత్వ పథకం అర్హుడికి చేరకపోయినా, పేద కుటుంబం సమస్యలో ఉన్నా --- ముందుగా ఆ సమస్యను వెలుగులోకి తీసుకురావడానికి ప్రయత్నించేది చాలాసార్లు స్థానిక జర్నలిస్టే.

### అధికార యంత్రాంగాన్ని కదిలించే అక్షరం

ఒక చిన్న గ్రామంలో ఉన్న సమస్య అధికారుల దృష్టికి చేరకపోవచ్చు. ఒక నిరుపేద కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బంది పాలకుల కార్యాలయానికి చేరకపోవచ్చు. ప్రభుత్వ పథకం అమలులో ఉన్న లోపం పైస్థాయి అధికారులకు తెలియకపోవచ్చు.కానీ అదే విషయం వార్తగా వెలువడినప్పుడు పరిస్థితి మారుతుంది.ఒక వార్త అధికారిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లవచ్చు. ఒక కథనం ద్వారా నిలిచిపోయిన పనికి కదలిక రావచ్చు. ఒక బాధిత కుటుంబానికి న్యాయం జరిగే అవకాశం కలగవచ్చు. ఒక ప్రజా సమస్యపై అధికార యంత్రాంగం స్పందించవచ్చు.అందుకే జర్నలిస్టు కేవలం వార్తను రాసే వ్యక్తి మాత్రమే కాదు.

### ప్రజలకు--ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే బాధ్యతాయుతమైన సమాచార ప్రతినిధి

### నిజం రాస్తే ఎందుకు దాడులు?

జర్నలిస్టు ఎదుర్కొనే అత్యంత తీవ్రమైన సమస్య భద్రత.ప్రజా ప్రయోజనానికి సంబంధించిన అంశాలపై వార్తలు రాసే క్రమంలో కొందరు జర్నలిస్టులు రాజకీయ, ఆర్థిక, సామాజిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నారు. అక్రమాలు, భూకబ్జాలు, అక్రమ ఇసుక రవాణా, కల్తీ వ్యాపారాలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణాలు, ప్రజాధన వినియోగంలో లోపాలు, ప్రభుత్వ పథకాలలో అక్రమాలు వంటి అంశాలను వెలుగులోకి తీసుకువచ్చినప్పుడు సంబంధిత ప్రయోజన వర్గాల నుంచి ప్రతిఘటన ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయి.కొన్ని సందర్భాల్లో బెదిరింపులు ఫోన్ కాల్స్ రూపంలో వస్తాయి.మరికొన్ని సందర్భాల్లో వ్యక్తిగత దూషణలకు దిగుతారు.ఇంకొన్ని సందర్భాల్లో కుటుంబ సభ్యులను కూడా ఒత్తిడికి గురిచేసే ప్రయత్నాలు జరుగుతాయి.ఇంతటితో ఆగకుండా కొన్ని సందర్భాల్లో భౌతిక దాడులు, వాహనాలతో ఢీకొట్టే ప్రయత్నాలు, కార్యాలయాలపై దాడులు, పరికరాల ధ్వంసం, అక్రమ కేసులు వంటి తీవ్రమైన పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

ఒక జర్నలిస్టుపై దాడి అంటే ఒక వ్యక్తిపై దాడి మాత్రమే కాదు. అతను ప్రతినిధ్యం వహిస్తున్న ప్రజా సమాచార హక్కుపై దాడిగా చూడాల్సిన అవసరం ఉంది.

### కేసుల భయం.. ఆర్థిక ఒత్తిడి

వార్త రాసినందుకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి రావడం ఒక విషయం. కానీ జర్నలిస్టును భయపెట్టే ఉద్దేశంతో వరుసగా కేసులు, న్యాయపరమైన ప్రక్రియలు, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగే పరిస్థితులు సృష్టించడం మరో విషయం.ఒక సాధారణ క్షేత్రస్థాయి జర్నలిస్టుకు న్యాయపోరాటం ఆర్థికంగా చాలా భారంగా మారవచ్చు.ఇప్పటికే పరిమిత ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్న వ్యక్తికి న్యాయవాది ఖర్చులు, కోర్టు ప్రయాణాలు, సమయం, ఇతర వ్యయాలు అదనపు భారంగా మారుతాయి.

దీంతో ఒక దశలో---

“ప్రజల కోసం వార్త రాయాలా? లేక నా కుటుంబ భద్రత, జీవనం కోసం మౌనంగా ఉండాలా?”

అనే ప్రశ్న జర్నలిస్టు ముందుకొస్తుంది.

ఇలాంటి పరిస్థితి ప్రజాస్వామ్యానికి ఆరోగ్యకరం కాదు.కలం ఆగితే.. ప్రజల గొంతు బలహీనమవుతుందిఒక జర్నలిస్టు భయంతో వార్త రాయడం మానేస్తే ఆ నష్టం కేవలం ఆ జర్నలిస్టుకే కాదు. ఒక గ్రామ సమస్య వెలుగులోకి రాకపోవచ్చు. ఒక పేద కుటుంబం బాధ అధికారుల దృష్టికి చేరకపోవచ్చు. ఒక అక్రమం కొనసాగవచ్చు. ఒక ప్రజా ఆస్తి దుర్వినియోగం బయటపడకపోవచ్చు.

అందుకే జర్నలిస్టు కలానికి రక్షణ కల్పించడం అంటే ప్రజల గొంతుకు రక్షణ కల్పించడమే.

పత్రికారంగం స్వేచ్ఛగా పనిచేసే వాతావరణం ఉన్నప్పుడే పాలనలో పారదర్శకత పెరుగుతుంది. ప్రశ్నించే మీడియా ఉన్నప్పుడే అధికార వ్యవస్థ మరింత జవాబుదారీతనంతో పనిచేసే అవకాశం ఉంటుంది.

### జర్నలిస్టుకు ఆర్థిక భద్రత ఎందుకు అవసరం?

సమాజం కోసం పనిచేసే జర్నలిస్టు కుటుంబం కూడా అదే సమాజంలో భాగమే. అతనికి కూడా పిల్లల చదువు, కుటుంబ పోషణ, వైద్యం, ఇల్లు, భవిష్యత్తు వంటి అవసరాలు ఉంటాయి.కానీ క్షేత్రస్థాయిలో పనిచేసే అనేక మంది విలేకరులు పరిమిత ఆదాయంతోనే తమ వృత్తిని కొనసాగిస్తున్నారు. కొందరికి స్థిరమైన వేతనం ఉండకపోవచ్చు. ఉద్యోగ భద్రత పరిమితంగా ఉండవచ్చు. ప్రమాదం జరిగినప్పుడు ఆదుకునే సామాజిక భద్రతా వ్యవస్థ అందుబాటులో లేకపోవచ్చు.ప్రజల సమస్యల కోసం నిరంతరం పరుగులు తీసే జర్నలిస్టుకు తన కుటుంబ భవిష్యత్తుపై భద్రత లేకపోతే, అతని వృత్తి స్వాతంత్ర్యం కూడా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంటుంది.అందుకే జర్నలిస్టుల సంక్షేమాన్ని దానం లేదా దయగా కాకుండా ప్రజాస్వామ్య వ్యవస్థకు అవసరమైన సామాజిక మౌలిక సదుపాయంగా చూడాలి.

### వైద్యం, బీమా.. అత్యవసర అవసరాలు

విధి నిర్వహణలో జర్నలిస్టులు కూడా ప్రమాదాలకు గురవుతారు. రోడ్డు ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో కవరేజ్, అల్లర్లు, అగ్ని ప్రమాదాలు, నేర సంఘటనలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో వార్తా సేకరణ --- ఇవన్నీ ప్రమాదంతో కూడుకున్న పనులే.

అటువంటి సమయంలో జర్నలిస్టుకు లేదా అతని కుటుంబానికి అత్యవసర వైద్య సహాయం అందించే వ్యవస్థ ఉండాలి.

ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, అత్యవసర సహాయ నిధి, కుటుంబ సంక్షేమ పథకాలు వంటి చర్యలు క్షేత్రస్థాయి జర్నలిస్టులకు ఎంతో ఉపయోగపడతాయి.

జర్నలిస్టు ప్రజల ఆరోగ్యం, భద్రత, హక్కుల గురించి రాస్తున్నప్పుడు.. అతని ఆరోగ్యం, భద్రతను కూడా వ్యవస్థ పట్టించుకోవాలి.

### అక్రిడిటేషన్‌తోనే జర్నలిస్టు విలువ నిర్ణయించాలా?

అక్రిడిటేషన్ ఒక అధికారిక గుర్తింపు వ్యవస్థలో భాగం. అయితే క్షేత్రస్థాయిలో నిరంతరం పనిచేసే ప్రతి జర్నలిస్టు వృత్తిపరమైన సేవలను కేవలం ఒక కార్డు ఆధారంగా మాత్రమే అంచనా వేయడం సరైన విధానం కాదనే చర్చ అవసరం.

నిజమైన జర్నలిస్టును గుర్తించేందుకు అతని నిరంతర వార్తా కవరేజ్, ప్రచురిత కథనాలు, వృత్తిపరమైన నిబద్ధత, సంస్థాగత అనుబంధం, నైతిక ప్రమాణాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే పారదర్శక విధానం అవసరం.

అక్రిడిటేషన్ ప్రక్రియలో సరళత, పారదర్శకత, సమయపాలన, నిజమైన క్షేత్రస్థాయి జర్నలిస్టులకు ప్రాధాన్యత ఉండాలి.

### డిజిటల్ యుగంలో జర్నలిజానికి కొత్త సవాళ్లు

సాంకేతిక విప్లవం పత్రికారంగానికి ఎన్నో అవకాశాలు కల్పించింది. ఒకప్పుడు గంటలు పట్టే సమాచారం ఇప్పుడు కొన్ని క్షణాల్లోనే ప్రపంచానికి చేరుతోంది. మొబైల్ ఫోన్, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా, లైవ్ స్ట్రీమింగ్ వంటి సాధనాలు సమాచార ప్రసారాన్ని విప్లవాత్మకంగా మార్చాయి.అయితే ఈ వేగంతో పాటు ప్రమాదాలు కూడా పెరిగాయి.వేగం కోసం వాస్తవాన్ని కోల్పోవడం జర్నలిజం కాదు.ఎవరైనా సోషల్ మీడియాలో ఒక సమాచారం పోస్ట్ చేశారనే కారణంతో దానిని వార్తగా ప్రచురించడం ప్రమాదకరం. ఫేక్ న్యూస్, మార్ఫింగ్ ఫొటోలు, పాత వీడియోలను కొత్త ఘటనలుగా ప్రచారం చేయడం, అసంపూర్ణ సమాచారంతో సంచలన శీర్షికలు పెట్టడం వంటి ధోరణులు మీడియా విశ్వసనీయతకు సవాలుగా మారుతున్నాయి.

ఈ నేపథ్యంలో జర్నలిస్టు బాధ్యత మరింత పెరిగింది.

ముందుగా ప్రచురించడం కంటే ముందుగా నిజాన్ని నిర్ధారించడం ముఖ్యం.

జర్నలిస్టు స్వేచ్ఛతో పాటు బాధ్యత కూడా అవసరం

జర్నలిస్టుల రక్షణ గురించి మాట్లాడుతున్నప్పుడు పత్రికారంగం తన బాధ్యతను కూడా గుర్తుంచుకోవాలి.

వార్త వాస్తవాల ఆధారంగా ఉండాలి. వ్యక్తిగత కక్షలు వార్తలుగా మారకూడదు. నిర్ధారణ లేని ఆరోపణలకు ప్రచారం ఇవ్వకూడదు. బాధితుల గోప్యతను గౌరవించాలి. బాలల వివరాలు, సున్నితమైన కేసులు, కుటుంబ సమస్యలు వంటి అంశాల్లో ప్రత్యేక జాగ్రత్త అవసరం.

స్వేచ్ఛకు బాధ్యత జత అయితేనే జర్నలిజం విశ్వసనీయతను నిలబెట్టుకోగలదు.

అందుకే జర్నలిస్టుల రక్షణతో పాటు జర్నలిస్టుల నైతిక ప్రమాణాల పరిరక్షణ కూడా అంతే ముఖ్యమైనది.

### ప్రత్యేక జర్నలిస్టుల రక్షణ వ్యవస్థ అవసరం

విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టుపై దాడి జరిగినప్పుడు కేసు సాధారణ ఘటనగా మిగిలిపోకూడదు. దాడి వెనుక ఉన్న ఉద్దేశం, వార్తా కవరేజ్‌తో దాడికి సంబంధం ఉందా, బెదిరింపులు ముందుగా వచ్చాయా, నిందితులు ఎవరు వంటి అంశాలపై వేగంగా దర్యాప్తు జరిగే వ్యవస్థ అవసరం.

జర్నలిస్టులపై హింసను నిరోధించేందుకు అవసరమైన చట్టపరమైన రక్షణ, వేగవంతమైన ఫిర్యాదు వ్యవస్థ, బాధిత జర్నలిస్టులకు న్యాయ సహాయం, అత్యవసర భద్రతా చర్యలు వంటి అంశాలపై ప్రభుత్వాలు సమగ్ర విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉంది.

దాడి జరిగిన తర్వాత స్పందించడం మాత్రమే కాకుండా, ముందుగానే ప్రమాదాన్ని గుర్తించి రక్షణ కల్పించే వ్యవస్థ ఉంటే మరింత ప్రయోజనం ఉంటుంది.

### ప్రభుత్వం చేయాల్సినవి ఏమిటి?

జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు పరిశీలించాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి.

**1. జర్నలిస్టుల భద్రత**

విధి నిర్వహణలో బెదిరింపులు లేదా దాడులు ఎదుర్కొనే జర్నలిస్టులకు తక్షణ ఫిర్యాదు, రక్షణ మరియు దర్యాప్తు వ్యవస్థ ఉండాలి.

**2. ఆరోగ్య భద్రత**

అర్హులైన జర్నలిస్టులకు ఆరోగ్య బీమా, కుటుంబ వైద్య సహాయం వంటి పథకాలను బలోపేతం చేయాలి.

**3. ప్రమాద బీమా**

విధి నిర్వహణలో ప్రమాదానికి గురయ్యే క్షేత్రస్థాయి జర్నలిస్టులకు తగిన ప్రమాద బీమా కల్పించాలి.

**4. సంక్షేమ నిధి**

అత్యవసర పరిస్థితుల్లో జర్నలిస్టులు, వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే సంక్షేమ నిధిని బలోపేతం చేయాలి.

**5. అక్రిడిటేషన్‌లో పారదర్శకత**

అర్హులైన క్షేత్రస్థాయి జర్నలిస్టులకు నిబంధనల ప్రకారం పారదర్శకంగా అక్రిడిటేషన్ అందేలా చూడాలి.

**6. న్యాయ సహాయం**

వృత్తి నిర్వహణకు సంబంధించిన కేసుల్లో అర్హులైన జర్నలిస్టులకు అవసరమైన న్యాయ సహాయం అందించే వ్యవస్థపై ప్రభుత్వం పరిశీలన చేయాలి.

**7. కుటుంబ సంక్షేమం**

విధి నిర్వహణలో మరణించిన లేదా శాశ్వతంగా అశక్తులైన జర్నలిస్టుల కుటుంబాలకు తగిన సంక్షేమ చర్యలు ఉండాలి.

సమాజం కూడా తన బాధ్యతను గుర్తించాలి జర్నలిస్టుల రక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత కాదు. సమాజానిదీ బాధ్యతే. ఒక జర్నలిస్టు గ్రామ సమస్యను వెలుగులోకి తెచ్చినప్పుడు అతని వార్తను చదివి ముందుకు వెళ్లిపోవడం కాకుండా, ఆ సమస్య పరిష్కారానికి సమాజం కూడా స్పందించాలి.

ఒక జర్నలిస్టుపై దాడి జరిగినప్పుడు---

“అతనికి ఎందుకు అవసరం?”

అనే ప్రశ్న వేయడం కంటే,

“నిజం రాసినందుకు ఒక వ్యక్తిపై దాడి జరిగే పరిస్థితి ఎందుకు వచ్చింది?”అనే ప్రశ్న సమాజం వేయాలి.

జర్నలిస్టుపై దాడి జరిగినప్పుడు రాజకీయ, కుల, మత, వ్యక్తిగత భేదాలకు అతీతంగా పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం సమాజం నిలబడాలి.

### కలం బలహీనపడితే ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది

ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నించే గొంతులు అవసరం. ప్రభుత్వాన్ని విమర్శించడం అంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండటం కాదు. ప్రజల తరఫున ప్రశ్నించడం పాలనను మరింత మెరుగుపరచడానికి సహాయపడుతుంది.

అధికారులు చేసిన మంచి పనులను ప్రజలకు తెలియజేయడం ఎంత ముఖ్యమో, లోపాలను కూడా నిర్మాణాత్మకంగా ఎత్తిచూపడం అంతే ముఖ్యం.

జర్నలిస్టు పని ఎవరి వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయడం కాదు; ప్రజా ప్రయోజనాన్ని కాపాడటం.

అందుకే నిజాయితీగా పనిచేసే జర్నలిస్టుకు రక్షణ కల్పించడం ద్వారా సమాజం తన ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటుంది.

### ‘కలం’ ఆగకూడదు.. ‘నిజం’ ఓడకూడదు

నేటి పరిస్థితుల్లో జర్నలిస్టుకు భద్రత, గౌరవం, ఆర్థిక భరోసా, ఆరోగ్య రక్షణ, వృత్తి స్వేచ్ఛ అవసరం. అదే సమయంలో జర్నలిస్టు కూడా తన వృత్తి ప్రమాణాలను కాపాడుకోవాలి.

ప్రలోభాలకు లొంగకుండా.. బెదిరింపులకు భయపడకుండా.. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయకుండా.. వాస్తవాలను నిర్ధారించి.. ప్రజా ప్రయోజనాన్ని కేంద్రంగా చేసుకుని పనిచేసే జర్నలిజమే సమాజానికి అవసరం.

“కత్తి కంటే కలం బలమైనది” అనే నానుడి కేవలం మాటగా మిగలకూడదు. ఆ కలం స్వేచ్ఛగా, బాధ్యతగా, నిర్భయంగా పనిచేసే వాతావరణం ఏర్పడాలి.

ఒక జర్నలిస్టు కలం ఆగిపోతే ఒక వార్త ఆగవచ్చు. ఒక వార్త ఆగితే ఒక సమస్య వెలుగులోకి రాకపోవచ్చు.ఒక సమస్య వెలుగులోకి రాకపోతే ఒక బాధితుడికి న్యాయం ఆలస్యం కావచ్చు.

అందుకే---జర్నలిస్టును కాపాడటం అంటే ఒక వ్యక్తిని కాపాడటం కాదు.

ప్రజల గొంతును కాపాడటం. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం. నిజాన్ని కాపాడటం.

ప్రజల కోసం అక్షరాలను ఆయుధాలుగా మార్చుకునే జర్నలిస్టుకు సమాజం అండగా నిలిచినప్పుడే “ప్రజాస్వామ్యం ప్రజల కోసం” అనే మాటకు నిజమైన అర్థం వస్తుంది.

కలం స్వేచ్ఛగా సాగాలి..

నిజం నిర్భయంగా పలకాలి.. జర్నలిస్టు సురక్షితంగా ఉండాలి.. అప్పుడే ప్రజాస్వామ్యం సజీవంగా ఉంటుంది.



గన్ రెడ్డి కరుణాకర్ రెడ్డి
ఈ69న్యూస్ ప్రిన్సిపల్ కరెస్పాండెంట్

# రాఖీ పండుగ--అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక

(తెలుగు గళం దినపత్రిక పాఠకులకు రక్షాబంధన్ శుభాకాంక్షలు)



భారతీయ సంస్కృతిలో పండుగలకు ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి పండుగ వెనుక ఒక గొప్ప సంప్రదాయం, ఆత్మీయత, కుటుంబ విలువలు దాగి ఉంటాయి. అలాంటి పండుగల్లో రక్షాబంధన్ లేదా రాఖీ పండుగ ఒకటి. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమ, అనుబంధం, పరస్పర నమ్మకానికి రాఖీ పండుగ ప్రతీకగా నిలుస్తుంది.శ్రావణ పౌర్ణమి సందర్భంగా జరుపుకునే రక్షాబంధన్ రోజున సోదరీమణులు తమ సోదరులకు రాఖీ కట్టి, వారి సుఖసంతోషాలను కోరుకుంటారు. సోదరులు తమ సోదరీమణులకు బహుమతులు అందించి, వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇస్తారు. ఈ చిన్న రాఖీ దారంలో ప్రేమ, ఆప్యాయత, బాధ్యత, రక్షణ వంటి ఎన్నో భావాలు ముడిపడి ఉంటాయి.రాఖీ పండుగ కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు. కుటుంబ బంధాలను మరింత బలపరిచే గొప్ప సందర్భం. ఉద్యోగాలు, చదువులు, ఇతర కారణాలతో దూరంగా ఉన్న అన్నాచెల్లెళ్లు ఈ రోజున ఒకరినొకరు కలుసుకోవడం, శుభాకాంక్షలు చెప్పుకోవడం ద్వారా తమ అనుబంధాన్ని

గుర్తుచేసుకుంటారు.దూరంగా ఉన్నవారు కూడా ఫోన్, వీడియో కాల్ లేదా ఇతర మార్గాల ద్వారా రాఖీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.మారుతున్న కాలంతో పండుగను జరుపుకునే విధానంలో మార్పులు వచ్చినప్పటికీ, రాఖీ పండుగలోని అసలు స్ఫూర్తి మాత్రం మారలేదు.సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, గౌరవం, బాధ్యత, ఆత్మీయత కొనసాగుతూనే ఉన్నాయి. నేటి సమాజంలో కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు కొంత తగ్గుతున్న సమయంలో ఇలాంటి పండుగలు బంధాలను గుర్తుచేసి మరింత దగ్గర చేస్తాయి.రాఖీ పండుగ మనకు మరో ముఖ్యమైన సందేశాన్ని కూడా అందిస్తుంది. రక్షణ అనేది ఒక్కరి బాధ్యత కాదు..పరస్పరం ఒకరికొకరు అండగా నిలవడమే నిజమైన బంధం.సోదరుడు సోదరీమణికి అండగా నిలవడమే కాకుండా, సోదరి కూడా సోదరుడి జీవితంలో ప్రేమ, ధైర్యం, ప్రోత్సాహాన్ని అందిస్తుంది.అందుకే రాఖీ ఒక దారం మాత్రమే కాదు.. అది జీవితాంతం కొనసాగే బంధానికి గుర్తు. ప్రేమతో కట్టిన ఆ చిన్న రాఖీ కుటుంబ విలువలను, అనుబంధాలను, పరస్పర విశ్వాసాన్ని గుర్తుచేస్తుంది. భారతీయ సంస్కృతిలో అన్నాచెల్లెళ్ల బంధానికి ప్రత్యేక గౌరవాన్ని చాటిచెప్పే రక్షాబంధన్ పండుగ ప్రతి ఇంటా ఆనందం, ఆప్యాయతలను నింపాలని కోరుకుందాం.

# జర్నలిస్టుల పాదయాత్రకు అపూర్వ స్పందన"

● రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమానికి ఐదు లక్షలు ఇస్తున్న ఎమ్మెల్యే మట్టా" ● జర్నలిస్టులకు ఇండ్లు,ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి కట్టుబడి ఉన్నాం: ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్" ● ఇండ్ల స్థలాలు ఇప్పిస్తామని సొమ్ములు అడిగే వారిని నమ్మకండి: మట్టా దయానంద్(రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు) ● సుభాష్,బాబాసాహెబ్ విగ్రహాలకు నివాళులు" ● భారీ ప్రదర్శన" ● తహశీల్దార్ కు వినతి" ● రాగమయి ను సత్కరించిన టిడబ్ల్యుజెఎఫ్ నేతలు"





సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు27(తెలుగుగళం) న్యూస్: జర్నలిస్టులకు ఇండ్లు,ఇండ్లస్థలాలు ప్రభుత్వం ఇవ్వాలని కోరుతూ టి.డబ్ల్యు.జె.ఎఫ్.(తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) ఆగస్టు 22 న అమర జర్నలిస్ట్ షోయబుల్లాఖాన్ 78 వ వర్ధంతి నాడు ఆయన జన్మించిన గ్రామమైన ఖమ్మంజిల్లా తిరుమలాయపాలెం మండలం,సుబ్లేడు గ్రామంలో గల ఖాన్ విగ్రహం వద్ద ఘనంగా ప్రారంభించిన పాదయాత్ర గురువారం సత్తుపల్లి పట్టణానికి చేరుకుంది.పాదయాత్ర కు స్థానిక జర్నలిస్టులు,

బి.ఆర్.ఎస్.,కాంగ్రెస్,సీపీఎం పార్టీల నేతలు,కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా పాదయాత్ర బృందం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద నుండి బోస్ బొమ్మ సెంటర్ మీదుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తూ సుభాష్,బాబా సాహెబ్ విగ్రహాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం అంబేద్కర్ సెంటర్లో రాష్ట్ర కమిటి సభ్యులు చిన్నిని బాలు అధ్యక్షతన జరిగిన సభలో పాల్గొని మద్దతు తెలిపిన సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణంలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఏడాదికి ఐదు లక్షల రూపాయలు బ్యాంక్ లో డిపాజిట్ చేస్తున్నామని తెలంగాణ రాష్ట్రంలో అలా చేసే ఎమ్మెల్యే కేవలం నేనే అని ఆమె తెలిపారు.

జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇచ్చే దానికి కట్టుబడి ఉన్నామని ఆమె స్పష్టం చేశారు.స్థలం కూడా పరిశీలించామని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకెళ్ళమని నియోజకవర్గంలో గల అందరు జర్నలిస్టులకు ఇండ్లు ఇండ్లస్థలాలు ఇచ్చే యోచన చేస్తున్నామని తెలిపారు.అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ నేత మట్టా దయానంద్ విజయ్ కుమార్ మాట్లాడుతూ మాకు ఎప్పుడూ జర్నలిస్టుల సంపూర్ణ మద్దతు ఉందని మా కుటుంబ సభ్యులుగా ఉన్నారని అన్నారు.నిజాలను తెలుసుకొని వార్తలను రాయాలని సూచించారు. ఏ పార్టీలో ప్రజల సంక్షేమం కోసం మట్టా కుటుంబం పరి తపిస్తుందని దయానంద్ స్పష్టం చేశారు.పేదలకు ఇండ్లస్థలాలు మేమే కాలువలు పూడ్పించి ఇస్తామని డబ్బులు వసూలు చేసే వారిని నమ్మవద్దని ఇండ్ల స్థలాలు ఇచ్చేది కేవలం మీ ఎమ్మెల్యే మట్టా రాగమయి మాత్రమేనని మోసపోవద్దని అన్నారు.అనంతరం టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బట్టిపాటి రాజశేఖర్ మాట్లాడుతూ సాధారణ పౌరులుగా నైనా గుర్తించి వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇవ్వాలని అసెంబ్లీ సమావేశాలలో ఎమ్మెల్యే రాగమయి గళం విప్పాలని అన్నారు. రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యే జర్నలిస్టుల సంక్షేమాన్ని గుర్తించి సంక్షేమనిధి ఏర్పాటు చేయడం లేదని ఆ ఘనత కేవలం రాగమయి కే దక్కుతుందన్నారు.అనంతరం ఎమ్మెల్యే రాగమయి రాష్ట్ర ఐసిడిఎస్ శాఖ కమిటీ సభ్యురాలుగా ఎంపిక అయినందుకు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఖదీర్,కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, నలుబోలు మధుశ్రీ లు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. రాగమయి కు వినతిపత్రాన్ని ఇచ్చారు. అనంతరం పాల్గొన్న బి.ఆర్.ఎస్.పార్టీ నేతలు,మాజీ పురపాలక సంఘం అధ్యక్షులు కూసంపూడి మహేష్,మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మాజీ వార్డు కౌన్సిలర్ మల్లూరు అంకంరాజుల బృందం పాదయాత్ర బృందానికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు పోరాటానికి సంఘీభావం తెలిపారు.అనంతరం సీపీఎం జిల్లా కమిటి సభ్యులు జాజిరి శ్రీనివాస్,పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు,ఐద్వా నాయకురాళ్ళు జాజిరి జ్యోతి,కుమారి, సీపీఐఎం ఎల్ మాస్ లైన్ నేత శరత్ లు మద్దతు తెలిపి మాట్లాడుతూ సమాజంలో జరిగే మంచి చెడులను ప్రజలకు ప్రభుత్వాలకు వారధిగా ఉంటూ సమాచారం చేర వేసే జర్నలిస్టులు ఫోర్త్ ఎస్టేట్ గా ఉన్నారని,ప్రజా సమస్యలను వెలికి తీసి పాలకులను స్పందింప చేసే జర్నలిస్టులు ఇండ్ల స్థలాలు ఇల్లు కావాలని పాదయాత్ర లు చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోక పోవడం సరి కాదని తక్షణమే స్పందించాలని లేకుంటే వామపక్షాలు ప్రత్యక్ష పోరాటంలోకి దిగుతుయాని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక జర్నలిస్టులు షయ బుద్దీన్, బి.వి.రామారావు తదితరులు సంఘీభావం తెలిపారు.అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహశీల్దార్ శ్రీనివాస్ కు వినతిపత్రాన్ని ఇచ్చారు.ఈ కార్యక్రమంలో: సంఘం నాయకులు అర్షద్, రవికిరణ్, సురేంద్రరెడ్డి, చీపీ గంగాధర్, సుధాకర్, మల్లూరు చంద్రశేఖర్, ఆరెంపుల హరిబాబు, అఫ్జల్, గోదా నాగబాబు, గుంట్రు సూర్య, జగన్ లతో పాటు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# వేంసూరు లో టి.డబ్ల్యు.జె. ఎఫ్ పాదయాత్రకు ప్రెస్ క్లబ్ మద్దతు"

● బాబా సాహెబ్ కు ఘన నివాళులు" ● జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇచ్చే దానికి సుముఖంగా ఉన్నాం: మహమ్మద్ ఫక్రుద్దీన్(వేంసూరు గ్రామ సర్పంచ్)● సమాజ నిర్మాణ మూలస్థంభాలలో జర్నలిస్టులు కీలకం: సీపీఎం" ● మేము మీతో కలిసి నడుస్తాం: భాస్కర్ని వీరంరాజు (బీజేపీ నియోజకవర్గ కన్వీనర్)● జర్నలిస్టులకు సర్పంచుల మద్దతు"




సత్తుపల్లి/వేంసూరు,ఆగస్టు27(తెలుగు గళం) న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలానికి గురువారం చేరుకున్న టి.డబ్ల్యు.జె.ఎఫ్.(తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్) పాదయాత్ర బృందానికి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కెంపు రాజు సంపూర్ణ మద్దతు తెలిపారు.అనంతరం వేంసూరు గ్రామ సర్పంచ్,కాంగ్రెస్ నేత మహమ్మద్ ఫక్రుద్దీన్,సీపీఎం నేతలు అర్వపల్లి జగన్మోహన్ రావు,కొత్తా సత్యనారాయణ లు పాదయాత్ర బృందానికి పూలమాలలు వేసి స్వాగతం పలికారు.అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గ్రామ ప్రధాన రహదారి నుండి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న తహశీల్దార్ కార్యాలయం వరకు దిక్కులు పిక్కటిల్లేలా నినదిస్తూ ప్రదర్శన చేసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి తహశీల్దార్ జె.మాణిక్ రావు కు వినతిపత్రాన్ని ఇచ్చారు.అనంతరం తెలుగుగళం తెలుగు జాతీయ దినపత్రిక ఆర్సీ రిపోర్టర్ మల్లూరు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో అధ్యక్ష కార్యదర్శులు ఖదీర్ కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి లు మాట్లాడుతూ ఈ పాదయాత్ర ఏ రాజకీయ పార్టీ కు మద్దతు గానో,ప్రభుత్వానికి వ్యతిరేకంగానో చేసేది కాదని మా న్యాయమైన సమస్య ఇండ్లు ఇళ్ళస్థలాల ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసే మేల్కొలుపు యాత్ర అని స్పష్టం చేశారు.అనంతరం వేంసూరు గ్రామ సర్పంచ్ మహమ్మద్ ఫక్రుద్దీన్ సంఘీభావం తెలిపి మాట్లాడుతూ వేంసూరు మండల జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు ఇచ్చే దానికి ప్రభుత్వ భూమిని గుర్తించామని త్వరలో వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్లస్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే దానికి కాంగ్రెస్ ప్రభుత్వం,ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ లు సుముఖంగా ఉన్నామని తెలిపారు.అనంతరం సీపీఎం సీనియర్ నాయకులు కొత్తా సత్యనారాయణ,మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్ రావు,రైతు సంఘం మండల కార్యదర్శి అర్వపల్లి గోపాలరావు లు మద్దతిచ్చి మాట్లాడుతూ సమాజ, భారతదేశ రాజ్యాంగ నిర్మాణ మూల స్తంభాలలో కీలకమైన నాలుగో స్థంభం అయిన జర్నలిస్టులకు ఇండ్లు ఇండ్లస్థలాలు ప్రభుత్వం తక్షణమే ఇవ్వాలని లేకుంటే సీపీఎం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.అనంతరం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ని వీరంరాజు సంఘీభావం తెలిపి మాట్లాడుతూ మీ సమస్య మా సమస్యగా భావిస్తామని మేము మీతో కలిసి నడుస్తామని తెలిపారు.అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బట్టిపాటి రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నో జర్నలిస్టు సంఘాలు ఉన్నప్పటికీ విలేకర్లు ఏదుర్కొంటున్న న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పోరాడే సంఘం కేవలం ఫెడరేషన్ మాత్రమేనని అన్నారు.అనంతరం బి.ఆర్.ఎస్.పార్టీ నాయకులు కందుకూరు గ్రామ సర్పంచ్ మందపాటి వెంకటరెడ్డి,లింగపాలెం గ్రామ సర్పంచ్ ఎర్రా రమేష్,శంభునిగుడెం సీపీఎం నాయకులు,గ్రామ సర్పంచ్ అర్వపల్లి నరసింహారావు, లచ్చన్నగూడెం గ్రామ ఉప సర్పంచ్ బెజ్జూరి కిషోర్,గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు పోతునూరి మారేశ్వరరావు, రాష్ట్ర పామాయిల్ రైతుల సంఘం నాయకులు దొడ్డా చక్రధర్ రెడ్డి లు మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో: నవతెలంగాణ రిపోర్టర్ కంకటి రాఘవ,ఈనాడు పత్రిక రిపోర్టర్ మూర్తి, సూర్య రిపోర్టర్ బుడే,జాతీయవాణి దినపత్రిక రిపోర్టర్ అరెంపుల హరిబాబు,సీపీఎం నాయకులు మోరంపూడి వెంకటేశ్వరరావు,అర్వపల్లి వెంకటేశ్వరరావు,కొత్తా అప్పారావు,కాంగ్రెస్ నాయకులు మల్లెల్లి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మద్దిశెట్టి పోషయ్య మృతి సిపిఎం కు తీరని లోటు "

**-సంతాప సభలో నాయకుల ఘన నివాళి"**



సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు27(తెలుగుగళం) న్యూస్: సిపిఎం పార్టీ సత్తుపల్లి మండల నాయకుడు, పేద ప్రజల పక్షాన నిలబడి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన మద్దిశెట్టి పోశయ్య అకాల మరణం పార్టీకి, ప్రజా ఉద్యమానికి తీరని లోటని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జాజిరి శ్రీనివాస్ పేర్కొన్నారు. గంగారం గ్రామానికి చెందిన మద్దిశెట్టి పోశయ్య బుధవారం వరంగల్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. గురువారం గంగారం గ్రామంలో పోశయ్య సంతాప సభ కావూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జాజిరి శ్రీనివాస్ మాట్లాడుతూ పేద కుటుంబం నుంచి వచ్చిన ఆయన జీవితాంతం కష్టజీవులపక్షాన నిలబడి, పేదలు, రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన ప్రజా పోరాటాల్లో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించడంలో ఆయన కీలకంగా పని చేశారని కొనియాడారు. నిరాడంబర జీవితం గడుపుతూ పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధతో పనిచేశారని అన్నారు.

రైతుసంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు మాట్లాడుతూ పోశయ్య మరణం ఆయన కుటుంబానికి తీరని లోటని, ఆయన కుటుంబ సభ్యులకు సిపిఎం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. పోశయ్య ఆశయాలను కొనసాగిస్తూ పేదలు, కష్టజీవుల సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని పార్టీ మండల కార్యదర్శి జాజిరి జ్యోతి పేర్కొన్నారు. మద్దిశెట్టి పోశయ్య పార్థివ దేహం పై సిపిఎం పార్టీ ఎర్రజెండాను కప్పి, పూలమాలవేసి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కువారపు లక్ష్మణరావు, బండి వేలాద్రి, దాట్ల రాంబాబు, జయరాజు, దేవుళ్ళ రామారావు, పొలాసి భాగ్యమ్మ, కొలికి పోగు రత్తయ్య, కావేటి రాఘవ, కంచి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కడపలో రాయల్ జ్యువెలర్స్ షోరూమ్ ప్రారంభం.



తెలుగు గళంన్యూస్ కడపజిల్లా ఆగస్టు 27: కడప నగరంలోని వైవి. స్ట్రీట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రాయల్ జ్యువెలర్స్ షోరూమ్‌ను మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి. అంజాద్ బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా షోరూమ్ నిర్వాహకులైన పీర్ భాషా గారికి శు భాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కడపలో రాయల్ జ్యువెలర్స్ ప్రజల ఆదరణ పొందుతూ మరింత అభివృద్ధి చెందాలని కోరుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుభాన్ భాష, బంగారు రాజా, రాజశేఖర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ జమాల్ వలి, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్ జిల్లా కార్యదర్శి రమేష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చాంద్ బాషా, మాజీ కార్పొరేటర్ మొహమ్మద్ షఫీ, స్థానిక నాయకులు అల్లా బకాష్, ఇస్మాయిల్, సలీం, వ్యాపార ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

# కడప సీనియర్ జర్నలిస్ట్ పవన్ పంతుల కన్నుమూత...!



**తెలుగు గళం న్యూస్ కడపజిల్లా ఆగస్టు 27:**

వైయస్సార్, కడపజిల్లా.. పత్రికారంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ జర్నలిస్ట్ పవన్ పంతుల(69) గురువారం తెల్లవారుజామున 3 గంటల కు రిమ్స్ ఆసుపత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో జిల్లా మీడియా రంగం తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయింది. పవన్ పంతుల సుదీర్ఘ కాలంగా జర్నలిజం రంగంలో సేవలు అందించారు. ప్రముఖ దినపత్రికలైన 'ఆంధ్రజ్యోతి', 'సాక్షి' లలో సీనియర్ జర్నలిస్ట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రజా సమస్యలపై అనేక కథనాలను అందించి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. పవన్ పంతులు రాసిన కథనాలు ఎంతో మందిపై ప్రభావం చూపాయి. నిష్పాక్షికమైన వైఖరి, వృత్తిపట్ల నిబద్ధత పంతులు ప్రత్యేకతలు.

ఆయన మృతి పట్ల జిల్లాలోని పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు, తోటి జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పవన్ పంతుల మృతి పత్రికారంగానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన కుటుంబ సభ్యులకు తమ తీవ్ర సానుభూతిని తెలియజేశారు. సీనియర్ జర్నలిస్ట్ పవన్ పంతుల ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిద్దాం.

# నేత్ర దానం.. మహా దానం.. !!



తెలుగు గళం: నేత్రదానం చేయడం ద్వారా మరో ఇద్దరికీ ప్రపంచాన్ని చూపించవచ్చని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ లో 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేత్రదాన పక్షోత్సవాల అవగాహన, ప్రచార కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఒక వ్యక్తి మరణానంతరం నేత్ర, అవయవ దానం చేయడం ద్వారా మరి కొందరి జీవితాలను కాపాడవచ్చని అన్నారు.. పుట్టిన శిశువు నుండి అన్నీ వయస్సుల వారికి నేత్ర రుగ్మతలను గుర్తించి, తగిన చికిత్స అందించి వారికి మంచి చూపుతో ఆరోగ్య కరమైన జీవితం అందించాలని, ప్రజలు నేత్రదానంపై ఉన్న అపోహలను తొలగించుకొని, తమ కుటుంబ సభ్యులకు నేత్రదానం ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ల నిర్వహణ కొరకు 90 రోజులలో ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి తేవాలని, కలెక్టర్ తెలిపారు. మీ కళ్లను మరణానంతరం మట్టిలో కలపకుండా, మరొకరి జీవితంలో వెలుగుగా మార్చండి -- నేత్రదానం చేయండి" అని ప్రజలకు పిలుపునిచ్చారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా,, పెండెం వెంకట రమణ మాట్లాడుతూ... నేత్రదానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ఆగస్టు 25 నుండి సెప్టెంబర్ 8 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఆసుపత్రులు, నర్సింగ్ కళాశాలలు, వైద్య కళాశాలలు మరియు ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు నేత్రదానం ప్రాముఖ్యతను వివరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల నుండి ప్రభుత్వ వైద్య కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నర్సింగ్ విద్యార్థులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొని "నేత్రదానం చేయండి -- మరొకరికి చూపును ప్రసాదించండి" అంటూ ప్రజలకు అవగాహన కల్పించారు.

# పెంచలకోనలో ఘనంగా శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి బాలాలయ ప్రతిష్ఠాపన పూజలు



నెల్లూరు జిల్లా రాపూరు(తెలుగు గళం):-నెల్లూరు జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి వారి పట్టమహిషి శ్రీ ఆదిలక్ష్మి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ పనులకు తొలి అంకం మొదలైంది..సుమారు 6 కోట్ల రూపాయల భారీ వ్యయంతో ఈ ఆలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు.ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభ నేపథ్యంలో, అమ్మవారి నిత్య పూజలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు ఆలయ ప్రాంగణంలో 'బాలాలయం' నిర్మించి, అందులో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఈ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో భాగంగా గురువారం సాయంత్రం శ్రీవారి నందనవనంలో ప్రత్యేక యాగ్నిక పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగాప్రారంభించారు.

వైభవంగా ప్రత్యేక పూజలు

గురువారం సాయంత్రం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కింది ప్రత్యేక పూజలు మరియు హోమాలను వైభవంగా నిర్వహించారు.విశ్వక్సేన ఆరాధనపుణ్యాహవాచనం, రక్షాబంధనం ఋత్విక్ వరణం, మృత్సంగ్రహణం అంకురార్పణ వాస్తు పూజ మరియు వాస్తు హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు..ఈ పవిత్ర కార్యక్రమంలో ఆలయ ఈఓ కోవూరు జనార్ధన్ రెడ్డి,ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు, వేద పండితులు, ఋత్వికులు పాల్గొన్నారు.వీరితో పాటు ఆలయ మాజీ ట్రస్టు బోర్డు సభ్యులు పీర్ల సోమయ్య యాదవ్, ఆలయ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆవుల వినోద్ కుమార్, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

Printed and Published by BARISHETTI SRIKANTH on be half Of Telugu galam
H.No: H.NO: 8-2-293/82/BJR/127, BJR NAGAR, FILM NAGAR, GREATER HYDERABAD(M.CORP), PO:JUBILEE HILLS, HYDERABAD, TELANGANA - 500033.
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State, Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.